క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల : ఎస్సీ, ఎస్టీ బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఫిబ్రవరి 1లోపు ఆన్‌లైన్‌లో కులం, ఆదాయం, పుట్టిన ధ్రువీకరణ పత్రాలు ఆధార్ కార్డు , పాస్‌ఫొటోతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఐదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించి ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నేడు(గురువారం) ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, ఏపీఓ హరీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 2023, మార్చి నుంచి 2024, మార్చి 31 వరకు చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్‌పై నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10గంటలకు నిర్వహించే సభకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.

మొబైల్ అప్పగింత



మొగుళ్లపల్లి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితురాలికి అప్పగించారు. మండల కేంద్రానికి చెందిన వంతడుపుల అనుష్క సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఎస్సై అశోక్ బుధవారం బాధితురాలికి అప్పగించినట్లు వివరించారు.

దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి అర్బన్ : బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిఫ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు దాడి చేసినట్లు గాలిఫ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మణికంఠ, జగ్గయ్య, రాజు, నవీన్‌రావు, వేణు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల మంజూరు

భూపాలపల్లి అర్బన్ : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ యుద్ధ ప్రతిపాదికన ఇస్తున్నట్లు ఎస్‌ఈ మల్చూర్‌నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ఏడాది కాలంలో 2,328 సర్వీసులను మంజూరు చేసినట్లు తెలిపారు. 2023 సంవత్సరంతో పోలిస్తే 24శాతం సర్వీసులు పెరిగినట్లు తెలిపారు.

నియామకం

రేగొండ : తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం భూపాలపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా రేగొండ మండల కేంద్రానికి చెందిన కూరాకుల చిన్న మల్లయ్యను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దుగ్యాల స్వామి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. ఎరుకల కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

'పరిహారం చెల్లించాలి'

భూపాలపల్లి అర్బన్ : ఓసీ–3లో గాయపడి చనిపోయిన వోల్వో డ్రైవర్ అన్వార్‌పాషా కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఐఎన్టీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఏరియా ఇన్‌చార్జ్ కోలా నాగేంద్రబాబు కోరారు. ఈ మేరకు బుధవారం కాంట్రాక్ట్ కార్మికులు జీఎం కార్యాలయంలో అధికారులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఎస్‌వీఈసీ కాంట్రాక్ట్, సింగరేణి యాజమాన్యం స్పందించి బాధిత కుటుంబానికి రూ.35లక్షల పరిహారం చెల్లించా లని కోరారు.యాజమాన్యం స్పందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

భూనిర్వాసితులకు..

కాళేశ్వరం : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు తక్షణమే న్యాయం చేయాలని, ఎలికేశ్వరం రైతులపై పోలీసులు చేస్తున్న దాడులు నిలిపేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలం రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన రైతులు రాళ్ళ బండి కమలక్కను పరామర్శించి మాట్లాడారు. రైతులు ప్రాజెక్టు అభివృద్ధిని వ్యతిరేకించడం లేదని, వారికి తగిన నష్ట పరిహారాన్ని ఇప్పిస్తే భూములు ఇస్తామని చెప్పి రైతులు అంటున్నారని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి అందులో భూములు కోల్పోయే రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరు శ్రీకాంత్, కుమ్మరి రాజు, బొడ్డు స్మరణ, ఆతుకూరి శ్రీధర్లతోపాటు రైతులు ఉన్నారు.

నిందితుడి రిమాండ్

కాటారం : మహాముత్తారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన చిన్నారిపై అత్యాచార యత్నానికి పాల్పడిన నరేష్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఇక్కట్లు

- అందుబాటులో ఉండని దరఖాస్తుదారులు
- వలసదారుల వివరాల సేకరణకు ఇబ్బందులు



కోటంచలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

రేగొండ : ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే ఇంకా కొనసాగుతోంది. సొంతూరిలో ఇంటిని నిర్మించుకోవాలని ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించిన కొందరు ఉపాధి, పిల్లల చదువు నిమిత్తం పొరుగు గ్రామాలకు వెళ్లిపోవడం, మరికొందరు పట్టణాల్లో నివాసిస్తుడడంతో వారి సర్వే చేయడానికి కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 18,623 దరఖాస్తులు అధికారులకు అందాయి. ఈ దరఖాస్తుల ప్రకారం డిసెంబర్ 31 లోగానే సర్వే పూర్తి చేయాలని గడువు విధించింది. సకాలంలో సర్వే పూర్తిచేయాలని భావించినా క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా సర్వే ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మండలంలో 95 శాతం వరకు సర్వే పూర్తయింది. మిగిలిన సర్వేను పూర్తి చేయడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

ఇల్లు ఉన్న వారు కూడా..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కోసం దరఖాస్తులు సమర్పించిన వారిలో అనేక మంది సొంతంగా ఇల్లు ఉన్నవారు ఉన్నట్లు అనేక చోట్ల వెలుగులోకి వచ్చింది. అదనంగా గదులు నిర్మించుకుంటామని, లేదంటే తమకు ఉన్న ఇద్దరి సంతానంలో ఈ ఇల్లు ఒకరికైతే, మరొకటి నిర్మించుకుంటామని చెబుతున్నారు. మరికొందరు పాత ఇంటిని తొలగించి కొత్తగా నిర్మాణం చేపడతామని సర్వేలో అధికారులకు వివరించినట్లు తెలుస్తోంది. కొందరు సొంత ఇల్లు ఉన్న అద్దె ఇంటిలో ఉంటున్నామని ఖాళీ స్థలం వద్ద ఫొటో దిగుతున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారు తమకు అసలు స్థలం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొంతంగా స్థలం ఉండి అద్దె ఇంటిలో ఉన్న వారు, వరదలు, అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటి నిర్మాణం కోసం సాయం అందించాల్సి ఉంది.

ఫొటో తప్పనిసరి కావడంతో..

సర్వే చేస్తున్న కార్యదర్శులు దరఖాస్తుదారుడి పరిస్థితిని తెలియజేయడానికి ఫొటోలు తీయాల్సి వస్తుంది. దరఖాస్తుదారుడు ఉంటున్న ఇంటిని, స్థలం, ఇంటి పరిస్థితి తెలిసేలా, ఇంటి స్థలానికి సంబంధించిన ఫొటోలు తీయాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా సర్వేకు కార్యదర్శులు వెళ్లిన సమయంలో దరఖాస్తు దారులు లేకపోవడంతో రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తోంది. దరఖాస్తుదారులు అందుబాటులో లేని చోట సర్వే పూర్తి చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. ప్రతి దరఖాస్తును పరిశీలించి సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు అందడంతో ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని కార్యదర్శులు చెబుతున్నారు.

అందుబాటులో ఉండాలి



ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా సర్వే సందర్భంగా తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలి. కొంత మంది దరఖాస్తు దారులు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లారు. వారు అందుబాటులో లేక సర్వేను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నాం. మిగిలిన వారు వెంటనే ఆయా గ్రామాలకు చేరుకుని సర్వే చేయించుకోవాలి.

\- వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- రెండో రోజు సాగిన మాదిగ దండోరా రథయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాటారం : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ముక్తకంఠంతో నినాదించారు. మాదిగ కళాకారుల దండోరా రథయాత్ర లక్ష డప్పులు..వెయ్యి గొంతుకలు కార్యక్రమం బుధవారం రెండో రోజు కాటారం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఆటపాటలతో కొనసాగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి మాదిగ పాల్గొని మాట్లాడారు. దేశంలో వెనకబడిన వర్గాలకు న్యాయం జరగాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రిజర్వేషన్ కల్పిస్తే..కొంతమంది సంపన్న వర్గాల వారు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. 59 కులాలకు సమన్యాయం జరగాలని మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. 2024, ఆగస్టు 1వతేదీన సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణ సమన్యాయమని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకునే వీలును కల్పించదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన మరుక్షణమే రేవంత్ రెడ్డి దేశంలోనే మొట్టమొదటిగా వర్గీకరణ చేస్తానని చెప్పి, మాటతప్పి మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కమిషన్ పేరుతో కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని చెప్పారు. చావు డప్పు కొట్టకముందే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి యాత్రకు సంఘీభావం తెలుపుతూ..వర్గీకరణ న్యాయ బద్ధమని మాదిగలకు బీజేపీ ప్రభుత్వం వర్గీకరణకు మద్దతుగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు గాజుల భిక్షపతి, బొల్లి బాపు, బెల్లంపల్లి సురేష్, చిట్యాల సమ్మయ్య, పుట్టపర్తి శ్రీనివాస్, మంతెన సతీష్, చంద్రయ్య, మంతెన శ్రీధర్, శీను, రాజబాబు, గద్దల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ జోన్‌లోని ఇళ్లు సేకరించాలి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



సీఎండీకి వినతి పత్రం ఇస్తున్న పుట్ట మధు

మల్హర్ : మండలంలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లు, మిగులు భూముల సేకరణ, ఆర్ అండ్ఆర్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియాకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. జెన్‌కో ద్వారా తాడిచర్ల–1 కోల్ బ్లాక్ ఓపెన్ కాస్టుకు సంబంధించి డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లు ఓసీపీ బ్లాస్టింగ్‌లతో వెలువడే దుమ్ము,ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలు తాడిచర్ల డేంజర్ జోన్ భూ సేకరణ సమస్యలు, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి, అర్ని సత్యనారాయణ, రామిడి గట్టయ్య, రాగం సతీష్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎస్సై అశోక్



కాటారం: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. మండలంలోని కోర్కిశాల మోడల్ స్కూల్‌లో బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు. డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, బ్యాంకు సంబంధిత ఓటీపీలు, ముఖ్యంగా రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలకు సంబంధించిన ఏపీకే యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దని సూచించారు. పోలీసులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

కాటారం : సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కాటారం హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పీసీలు లక్ష్మిరాజ్, రఘు, నాగరాజులు ప్రజలకు సూచించారు. మండలంలోని చిదినేపల్లి గ్రామంలో సైబర్, డిజిటల్ నేరాలపై బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930కు కాల్ చేయాలని వివరించారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

చిట్యాల : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ రవీందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత, టీపీసీసీ సభ్యుడు, దళిత రత్న దబ్బెట రమేశ్‌ను, రాష్ట్రంలో అధికంగా సభ్యత్వాలు నమోదు చేయించిన చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిని, అత్యధిక మెజార్టీతో గెలిచిన అల్లకొండ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు.

'ఒత్తిడి మేరకే గురుకుల పాఠశాల తరలింపు'

భూపాలపల్లి అర్బన్ : రాజకీయ కక్షలో భాగంగానే మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను సింగరేణి భవనంలోని మారుస్తున్నారని అద్దె భవన యజమాని నాగుల దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు మైనార్టీ శాఖ అధికారులు సింగరేణి భవనంలోకి మార్చినట్లు తెలిపారు. ప్రభుత్వం తనకు నెలకు రూ.2లక్షల అద్దె చెల్లించేదని, ప్రస్తుతం సింగరేణికి కూడా నెలకు రూ.1.50లక్షల అద్దె చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెను తక్షణ మే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, రాజు పాల్గొన్నారు.

పేదల హక్కులకు సీపీఎం పోరాటం



సీపీఎంలో చేరిన వారితో సాంబశివ

- పార్టీ జిల్లా కార్యదర్శి సాంబశివ

గోవిందరావుపేట : పేదల హక్కుల కోసం సీపీఎం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాంబశివ తెలిపారు. ఈ మేరకు పెట్టుబడిదారులు, భూస్వాముల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల చెర నుంచి ప్రజలు విముక్తి పొందాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. ఈ మేరకు సాంబశివ ఆధ్వర్యంలో సీపీఎం చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై బుస్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలెపాక మహేందర్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు బుధవారం సీపీఎంలో చేరారు. పార్టీలో చేరిన వారికి సాంబశివ ఎర్ర కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుస్సాపూర్ గ్రామంలో సీపీఎం ఇంటి స్థలాలు, పోడు భూముల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. బుస్సాపూర్‌లో ఉన్న బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బూర్జువా, భూస్వాములకు తొత్తులుగా మారి ప్రజలను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పొదిళ్ల చిట్టిబాబు, సోమా మల్లారెడ్డి, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేష్, అంబాల మురళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ నాయకులు కేసారపు సురేందర్, ఇందారపు రాకేష్, గుగ్గిళ్ల రాజ్‌కుమార్‌లు బుధవారం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న కాలంలో మంత్రి శ్రీధర్ బాబు, శ్రీనుబాబు ప్రోత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.సదానందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్కా ప్రకాశ్, డైరెక్టర్ పొన్న తిరుపతి రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ ఇందారపు చంద్రయ్య, నాయకులు ఇందారపు ప్రభాకర్, చంద్రయ్య, రణధీర్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రేగొండ : మండల కేంద్రానికి చెందిన ఇప్పకాయల సరోజన, గడ్డం కిషన్, కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన అమ్ముల కవిత ఇటీవల మృతిచెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం పరామర్శించారు. నాయకులు పున్నం రవి, దుగ్యాల రాజేశ్వరరావు, మైస భిక్షపతి, పానుగోటి వీరబ్రహ్మం, రొంటాల వెంకటస్వామి, ముద్దమల్ల రవి, అమ్ముల సదయ్య, వావిలాల రమేష్, సామాల సురేందర్ ఉన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఎద్దుకు గాయాలు

- ఎద్దుతో నిరసన తెలిపిన రైతు




రోడ్డుపై ఎద్దుతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పలు ఇసుక క్వారీలకు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొని ఇనుముల బాపుకు చెందిన దుక్కిటెద్దుకు గాయాలయ్యాయి. బుధవారం రోడ్డుపై ఎద్దుతో సదరు రైతు నిరసన తెలిపాడు. గాయపడిన ఎద్దు విలువ రూ.40వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నాడు. అరగంట పాటు ట్రాఫిక్ నిలిచింది. దీంతో సంబంధిత శాఖ టీజీఎండీసీ అధికారులు రైతుతో మాట్లాడి నిరసను నిలిపివేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం : బయ్యారం క్రాస్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కాటారం నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న బొగ్గు లారీ బయ్యారం క్రాస్ సమీపంలో కారును తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో బొగ్గు లారీ డ్రైవర్ సమ్మయ్యకు గాయలు కావడంతో చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న రవీందర్


చిట్యాల : మండలంలోని ముచినిపర్తి గ్రామ బీఆర్ఎస్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంగిలి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా కంకల రాయకొమురు, గోగుల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దామెర సాంబయ్య, కార్యదర్శిగా కొంకుల రవి, కోశాధికారిగా అబ్బు సాంబరెడ్డి, అలాగే యూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మండల అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, పిట్ట సురేష్, యూత్ మండల అధ్యక్షుడు తొటం నవీన్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



టేకుమట్ల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ చిదిరాల సుధాకర్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఈదునూరి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, తిరుపతి, మోయిన్, తిరుపతి, పాహీమ్, నాగరాజు, సురేందర్, రమేష్, రాజు, ఆనంద్, కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ..




పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయ సమ్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందంజలో ఉందన్నారు. పెండింగ్ బిల్లులు, ఉద్యోగులు పీఆర్‌సీలు సాధించడం పీఆర్‌టీయూతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హకీం, సునీల్, మియాపురం జగన్నాదం, తోట మహేందర్, మేకల సదయ్య, ముత్యంరెడ్డి, సోమిడి స్వామి, వరికోలు ఉమాదేవి, పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్..



చిట్యాల : టీఎస్ యూటీఎఫ్ సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు బుధవారం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పెద్దపల్లి యోగేంద్రచారి మాట్లాడుతూ ప్రభుత్వంఉపాధ్యాయులకు పీఆర్సీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పాముకుంట్ల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బండారి సదయ్య, ఉపాధ్యాయులు బోడ అనిల్ కుమార్, నవత, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్..



మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ లింగాల కుమారస్వామి, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు గట్ల శ్రీనివాసరెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులతో పాటు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్‌లో ఉపాధ్యాయులు వృత్తి ,సామాజిక బా ధ్యత,చైతన్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శు లు సిరాజుద్దీన్,సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతూండ్లలో..



మల్హర్ : మండలంలోని పెద్దతూండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్–2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ప్రధానోపాధ్యాయుడు బి.తిరుపతి, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మానస, శర్మ, సవిత, యాకూబ్‌పాషా, ఐత మహేందర్, సరిత, రమేష్, శివకృష్ణ, రవీందర్, ఓఎస్ సందీప్ పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికిన వారిపై చర్య తీసుకోవాలి



టేకుమట్ల : కల్లుగీత కార్మికుల జీవనాధారమైన తాటిచెట్లను నరికిన వారిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం భిక్షపతి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుందనపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇదే గ్రామానికి చెందిన సుంకరపెల్లి శ్రీనివాస్‌రావు, పూర్ణచందర్‌లు అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లోని తాటిచెట్లను నరికి తొలగించారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా తాటిచెట్లను నరికిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తిరుపతి, కొమురయ్య, ముంజాల తిరుపతి, పొన్నం సాంబయ్య, దొమ్మట రవీందర్, తదితరులు పాల్గొన్నారు.